

మా కస్టమర్ల అవసరాలను తీర్చడానికి ప్రత్యేకంగా దృష్టి సారించడం జరుగుతున్నది. ఆరోగ్య బీమా రంగంలోకి అడుగుపెట్టడానికి చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటివరకైతే తుది నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశాలు మాత్రం లేవు. *-సిద్ధార్థ మోహంతీ, ఎల్ఐసీ సీఈవో-ఎండీ*

# ఎల్ఐసీ లాభం 11,056 కోట్లు

## క్యూ3లో 17 శాతం పెరిగిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: బీమా దిగ్గజం ఎల్ఐసీ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.11,056 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.9,444 కోట్ల లాభంతో పోలిస్తే 17 శాతం వృద్ధిని కనబరిచింది. కానీ, నికర ప్రీమియం వసూళ్ల ద్వారా వచ్చే ఆదాయం మాత్రం రూ.1,17,017 కోట్ల నుంచి రూ.1,06,891 కోట్లకు తగ్గినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. సమీక్షాకాలంలో కంపెనీ ఆదాయం రూ.2,01,994 కోట్లకు పరిమితమైంది.

- ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకాలంలో రూ.29,138 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.26,913 కోట్లతో పోలిస్తే 8 శాతం ఎగబాకింది.
- మొత్తం ప్రీమియం ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5.51 శాతం ఎగబాకి రూ.3,40,563 కోట్లకు చేరుకున్నది. దీంట్లో వ్యక్తిగత పునరుద్ధరణ ప్రీమియం వసూళ్లు రూ.1,78,975 కోట్లుగా ఉన్నాయి.
- గ్రూపు బిజినెస్ మొత్తం ప్రీమియం ఆదాయం రూ.1,13,057 కోట్ల నుంచి రూ.1,19,147 కోట్లకు పెరిగాయి.
- 1,17,10,505 వ్యక్తిగత పాలసీలను విక్రయించింది. గతేడాది తొమ్మిది నెలల్లో నమోదైన 1,25,56,046తో పోలిస్తే 7 శాతం వరకు తగ్గాయి.
- దేశీయ జీవిత బీమా మార్కెట్లో 57.42 శాతం వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతున్నది.
- కంపెనీ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ రూ.54,77,651 కోట్లకు చేరుకున్నాయి.

# మార్కెట్లోకి కేటీఎం నయా బైకులు

## ప్రారంభ ధర రూ.2.6 లక్షలు



పుణె, ఫిబ్రవరి 7: ప్రపంచంలో ప్రీమియం మోటర్‌సైకిళ్ల తయారీలో అగ్రగామి సంస్థ కేటీఎం ఒకేసారి మరో మూడు బైకులను అందుబాటులోకి తీసుకొచ్చింది. 2025 ఏడాదికిగాను విడుదల చేసిన కేటీఎం 250 అడ్వెంచర్ ధర రూ.2,59, 850, అలాగే కేటీఎం 390 అడ్వెంచర్ ఎక్స్ మాడల్ ధర రూ.2,91,140, కేటీఎం 390 అడ్వెంచర్ రూ. 3,67,699 ధరలు గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 399 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు 46 పీఎస్‌ల శక్తినివ్వనున్నది. వీటిలో కేటీఎం అడ్వెంచర్ బైకులు దేశీయ షోరూంలో లభించనుండగా, కేటీఎం 390 త్వరలో అందుబాటులోకి రానున్నది.

# జోస్ ఆలుక్కాస్‌లో తరుగు చార్జీలపై రాయితీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జోస్ ఆలుక్కాస్..బంగారు ఆభరణాల తరుగు చార్జీలపై 50 శాతం తగ్గింపును అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక ఆఫర్ దేశవ్యాప్తంగా ఉన్న జోస్ ఆలుక్కాస్‌కు చెందిన అన్ని షోరూంలలో లభించనున్నది. దీంతోపాటు వజ్రాలపై 20 శాతం, ప్లాటినమ్‌పై 7 శాతం తగ్గింపు ధరతో విక్రయిస్తున్నది. ఈ సందర్భంగా కంపెనీ చైర్మన్ జోస్ ఆలుక్కాస్ మాట్లాడుతూ..బంగారు ఆభరణాలు కొనడానికి ఇదే సరైన సమయమని, ఈ ఫ్లాట్ 50 శాతం తగ్గింపుతో కస్టమర్లకు అత్యున్నత నాణ్యత కలిగిన ఆభరణాలను అనువైన ధరకు సొంతం చేసుకోవచ్చునన్నారు.


# ఎన్నాళ్లకెన్నాళ్లకు



## ఐదేండ్ల తర్వాత వడ్డీరేట్లకు కోత పెట్టిన ఆర్బీఐ

## పావు శాతం తగ్గి 6.25 శాతానికి రెపో రేటు

## గృహ, వాహన, వ్యక్తిగత తదితర లోన్లపై దిగిరానున్న ఈఎంఐల భారం



ముంబై, ఫిబ్రవరి 7: రుణగ్రహీతలకు శుభవార్త. హౌజింగ్, ఆటో, పర్సనల్ లోన్లపై ఈఎంఐలు తగ్గనున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చాలాకాలం తర్వాత కీలక వడ్డీరేట్లకు కోత పెట్టింది మరి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) చివరి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో దాదాపు ఐదేండ్ల తర్వాత రెపో రేటును పావు శాతం తగ్గిస్తూ సెంట్రల్ బ్యాంక్ నిర్ణయం తీసుకున్నది. చివరిసారిగా 2020 మే నెలలో రెపో తగ్గింది. ఆ తర్వాత నుంచి పెరగడమో లేదా ఎక్కడిదక్కడే అన్నట్టుగానే ఉండిపోయింది. ఈ క్రమంలో శుక్రవారం రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతానికి చేర్చినట్టు ఆర్బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. మునుపు ఇది 6.50 శాతంగా ఉండేది. దీంతో బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గించబోతున్నాయి. ప్రస్తుతం అధిక శాతం రుణాలు రెపో రేటుకు అనుసంధానంగా ఉన్నవేనన్న విషయం తెలిసిందే. కాగా, ఈసారి ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు మొదట్నుంచే ఉన్నాయి. వాటికి తగ్గట్టుగానే నిర్ణయం వెలువడింది. నిజానికి గత ద్రవ్యసమీక్షలోనే వడ్డీరేట్ల కోతల సంకేతాలను అప్పటి గవర్నర్ శక్తికాంత దాస్ ఇచ్చారు. ఇందుకు తగ్గట్టుగానే మల్హోత్రా తన తొలి ద్రవ్యసమీక్షలోనే కోతకు దిగారు. అయినప్పటికీ ఆర్బీఐ ద్రవ్య వైఖరి తటస్థ విధానంలోనే ఉన్నది. దీంతో జీడీపీ, ద్రవ్యోల్బణం గణాంకాలకు తగ్గట్టుగా రాబోయే సమీక్షల్లో వడ్డీరేట్లు పెరగవచ్చు లేదా తగ్గవచ్చు. కాగా, ఈసారి సమీక్షలో ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ)లోని సభ్యులంతా వడ్డీరేట్ల తగ్గింపునకే ఓటేశారు.

### జీడీపీ వృద్ధి 6.7%

వచ్చే 2025-26లో దేశ జీడీపీ వృద్ధిరేటు 6.7 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. ఇక 2024-25 జీడీపీ 6.4 శాతంగా నమోదు కావచ్చని ఆర్బీఐ అంటున్నది.

### ఇక 'బ్యాంక్.ఇన్'

సైబర్ సెక్యూరిటీని మరింత బలోపేతం చేయడంలో భాగంగా ఇకపై భారతీయ బ్యాంకులు 'బ్యాంక్.ఇన్' పేరుతో ఎక్స్‌క్లూజివ్ ఇంటర్నెట్ డొమెయిన్‌ను అనుసరించనున్నాయి. అలాగే బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు 'ఫిన్.ఇన్' పేరుతో వెళ్లనున్నాయి. ఈ మేరకు ఆర్బీఐ నిర్ణయం తీసుకున్నది. ఏప్రిల్ 1 నుంచి బ్యాంక్.ఇన్ మొదలవుతుంది. ఆ తర్వాత ఫిన్.ఇన్ కూడా వస్తుంది. డిజిటల్ చెల్లింపుల్లో మోసాలు పెరుగుతున్న నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు.

### ద్రవ్యసమీక్షలో ముఖ్యాంశాలు

- సెబీలో నమోదైన నాన్-బ్యాంక్ బ్రోకర్లు ఇకపై నేరుగా నెగోషియేటెడ్ డీలింగ్ సిస్టమ్-ఆర్డర్ మ్యాచింగ్ (ఎన్‌డీఎస్-ఓఎం) చేయవచ్చు. సెకండరీ మార్కెట్ లావాదేవీల కోసం ఇతర క్లైయింట్ల తరపున ఇదో ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌గా ఉన్నది.
- బిమల్ జలాన్ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులపై కొనసాగుతున్న ఇంటర్నల్ రివ్యూ.
- లిక్విడిటీ కవరేజీ రేషియో (ఎల్‌సీఆర్) అమలు ఏడాదిపాటు వాయిదా.
- జనవరి 31 నాటికి దేశీయ ఫారెక్స్ రిజర్వులు 630.6 బిలియన్ డాలర్లు. వారంలో1.05 బిలియన్ డాలర్లు వృద్ధి.
- ఆమోదయోగ్యమైన స్థాయిలోనే కరెంట్ ఖాతా లోటు.
- వచ్చే ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం అంచనా 4.2 శాతం.
- తదుపరి ద్రవ్యసమీక్ష ఏప్రిల్ 7-9.

### 7 శాతాన్ని మించి వృద్ధి సాధ్యమే

- ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా



భారత్ 7 శాతానికిపైగానే ఆర్థిక వృద్ధిని నమోదు చేయగలదన్న విశ్వాసాన్ని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వ్యక్తం చేశారు. శుక్రవారం ద్రవ్యసమీక్ష సందర్భంగా మాట్లాడుతూ.. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ నిర్దిష్ట స్థాయిల్లో ఉండాలన్న లక్ష్యాన్ని పెట్టుకోలేదన్నారు. ఒడిదొడుకులు తీవ్రమైతే తప్పక జోక్యం చేసుకుంటామన్న ఆయన ఇప్పుడు రూపాయి విలువ పతనం కంటే అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులే ప్రమాదమన్నారు. ఇక మందగించిన దేశ ఆర్థిక వ్యవస్థను వడ్డీరేట్ల తగ్గింపు ఉత్తేజపర్చగలదన్న విశ్వాసాన్ని గవర్నర్ మల్హోత్రా కనబర్చారు.

### ఎవరేమన్నారు?

ఆర్బీఐ తగ్గించిన పావు శాతం రెపో రేటు.. మార్కెట్‌పై పరిమితంగానే ప్రభావం చూపిస్తుందనుకుంటున్నాం. కాబట్టి తదుపరి ద్రవ్యసమీక్షల్లో మరింతగా వడ్డీరేట్లను తగ్గిస్తేనే హౌజింగ్ డిమాండ్ పుంజుకునే వీలున్నది.

**-బొమన్ ఇరానీ, క్రెడాయ్ అధ్యక్షుడు**

నిర్మాణ రంగంపై ఆర్బీఐ వడ్డీరేట్ల తగ్గింపు సానుకూల ప్రభావాన్నే చూపగలదు. గృహ రుణాలు చౌకైతే, ఇండ్ల అమ్మకాలు పెరుగుతాయి. కాబట్టి బ్యాంకులు వెంటనే రుణాలపై వడ్డీరేట్లను తగ్గించాలి.

**-జీ హరిబాబు, నరెడ్కో అధ్యక్షుడు**

ఆర్బీఐ నిర్ణయం మదుపరుల్లో విశ్వాసాన్ని నింపింది. ఇండ్ల కొనుగోళ్లు పెరిగి దేశంలో నిర్మాణ రంగాభివృద్ధికి దోహదం చేయగలదు.

**-జీ మధుసూదన్, సుమధుర గ్రూప్**

దేశ జీడీపీ వృద్ధికి బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాలకు ఆర్బీఐ వడ్డీరేట్ల తగ్గింపు కూడా తోడైంది.

**-ఎంవీ రావు, ఐబీఏ చైర్మన్**

సరైన సమయంలోనే వడ్డీరేట్ల తగ్గింపు ప్రక్రియను ఆర్బీఐ ఆరంభించింది. ఆర్బీఐ ఇతర నిర్ణయాలూ భేష్.

**-సీఎస్ శెట్టి, ఎస్బీఐ చైర్మన్**

ఆర్థిక వృద్ధి బలోపేతానికి, స్థిరత్వానికి ఆర్బీఐ నిర్ణయం కలిసొస్తుంది. ద్రవ్యోల్బణం మరింత తగ్గితే.. రాబోయే ద్రవ్య సమీక్షల్లో వడ్డీరేట్లు ఇంకా దిగొస్తాయన్న నమ్మకం మాకున్నది.

**-చంద్రజిత్ బెనర్జీ, సీఐఐ డైరెక్టర్ జనరల్**

ఆర్బీఐ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. బ్యాంకులు కూడా ఈ దిశగా అడుగులు వేస్తాయని భావిస్తున్నాం.

**-హర్షవర్ధన్ అగర్వాల్, ఫిక్కీ అధ్యక్షుడు**

వాహన, నిర్మాణ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ తదితర దేశంలోని ప్రధాన రంగాలకు ఆర్బీఐ వడ్డీరేట్ల తగ్గింపు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది.

**-సంజయ్, అసోచామ్ అధ్యక్షుడు**

ఆర్బీఐ వడ్డీరేట్ల తగ్గింపు.. టూవీలర్, చిన్న కార్లకు గిరాకీని పెంచగలదు.

**-సియామ్, ఫడా అధ్యక్షులు**

# మార్చి 24 నుంచి బ్యాంక్ ఉద్యోగుల సమ్మె



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. వారానికి ఐదు రోజుల పని, అన్ని విభాగాల్లో ఉద్యోగ నియామకాలతోపాటు ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మార్చి 24 నుంచి రెండు రోజుల పాటు సమ్మె చేస్తున్నట్లు ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమ్మెలో 9 బ్యాంకింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉద్యోగులు పాల్గొంటున్నారని యూఎఫ్‌బీయూ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉద్యోగుల పనితీరు ఆధారంగా ఇన్సెంటీవ్‌లు ఇచ్చే ప్రతిపాదనను డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్(డీఎఫ్ఎస్) సూచనలను వెంటనే విరమించుకోవాలని, దీంతో ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లనున్నదని, అలాగే సిబ్బంది మధ్య విభజనకు దారితీసే ప్రమాదం ఉన్నదని యూఎఫ్‌బీయూ డిమాండ్ చేస్తున్నది.

# మార్కెట్లకు హుషారివ్వని ఆర్బీఐ నిర్ణయం

## సెన్సెక్స్ 198, నిఫ్టీ 43 పాయింట్ల నష్టం

ముంబై, ఫిబ్రవరి 7: వడ్డీరేట్లను తగ్గిస్తూ రిజర్వుబ్యాంక్ తీసుకున్న నిర్ణయం మదుపరులకు హుషారివ్వలేదు. మరోవైపు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను తరలించుకుపోతుండటంతో దేశీయ మార్కెట్లు వరుసగా మూడోరోజూ నష్టాల్లోనే కొనసాగాయి. ఒక దశలో 600 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 78 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి సెన్సెక్స్ 197.97 పాయింట్లు కోల్పోయి 77,860.19 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 43.40 పాయింట్లు కోల్పోయి 23,559.95 వద్ద స్థిరపడింది. నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో ఐటీసీ షేరు 2 శాతానికి పైగా పడిపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు ఎస్బీఐ, అదానీ పోర్ట్స్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, పవర్‌గ్రిడ్ షేర్లు నష్టపోయాయి. అలాగే నెస్లె, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, బజాజ్‌ఫైనాన్స్, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, మారుతి, యాక్సిస్ బ్యాంక్ షేర్లు పడిపోయాయి. కానీ, టాటా స్టీల్, ఎయిర్‌టెల్, జొమాటో, మహీంద్రాఅండ్‌మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, ఎన్‌టీపీసీ, కొటక్ బ్యాంక్, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

## ఉపాధ్యాయుల సర్టిఫికెట్

# రీ వెరిఫికేషన్ చేయాలి



మాట్లాడుతున్న జంగ్‌దేవ్ పటేల్


ఉట్నూర్, ఫిబ్రవరి 7: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యోగాల్లో సర్టిఫికెట్ రివెరిఫికేషన్ నిర్వహించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిడాం జంగ్‌దేవ్ పటేల్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో అవకతవకలు జరిగాయన్నారు. అందులో 35 మంది నకిలీ బోనఫైడ్ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందడంతో ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నకిలీ ధృవీకరణ పత్రాలతో ఉద్యోగాలు పొందిన వారిని తొలగించి కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే నకిలీ బోనఫైడ్ ఇస్తున్న స్కూల్ యాజమాన్యాలపై చీటింగ్ కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల ఉద్యోగాల్లో హడావుడిగా వెరిఫికేషన్ జరిగిందన్నారు. కావున వాటిపై అనుమానాలున్నాయన్నారు. జిల్లా అధికారులు స్పందించకుంటే ఈ నెల 17వ తేదీన కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు. జిల్లా ఇన్‌చార్జి దీపక్ కుమార్, కన్వీనర్లు తుకారాం, జనార్దన్ పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు సన్మానం..

జైనథ్, ఫిబ్రవరి 7: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలానికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ ఆత్రం నారాయణను శుక్రవారం మాజీ జడ్పీటీసీ దంపతులు తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీపూర్ మాజీసర్పంచ్ భగత్ గౌతం, బద్దం సురేశ్ రెడ్డి పాల్గొన్నారు.

# బీసీల ద్రోహి కాంగ్రెస్

- మొదటి నుంచి బీసీలకు అన్యాయమే
- తప్పుడు సర్వేతో రేవంత్ రెడ్డి మరోసారి రుజువు చేశారు
- తప్పుల తడకగా కులగణన
- మాజీ మంత్రి జోగు రామన్న



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ)రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడకగా ఉందని మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. కులగణన సర్వే వివరాలపై ఆయన ఆదిలాబాద్‌లో శుక్రవారం నమస్తే తెలంగాణతో మాట్లాడారు. రాష్ట్రంలో తప్పుడు సర్వే నిర్వహించి బీసీల జనాభాను తక్కువగా చూపి మోసం చేశారన్నారు. మొదటి నుంచి బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన కులగణనతో మరోసారి రుజువు అయిందన్నారు. బీసీలను రాజకీయంగా ఎదగనీయకుండా, ఇతర రంగాల్లో అభివృద్ధి చెందకుండా కాంగ్రెస్ కుట్రలు చేసిందన్నారు. నామ్‌కే వాస్తేగా సర్వే నిర్వహించి, బీసీలకు అన్యాయం చేసి బీసీల ద్రోహిగా కాంగ్రెస్ మిగిలిందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాట మరిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో కాకుండా గాంధీభవన్ వేదికగా ప్రకటించాల్సి ఉండేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదట నియమించిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ స్వయంగా కులగణన సరిగా జరగలేదనడం సర్వే తప్పుల తడగగా నిర్వహించడానికి నిదర్శమని తెలిపారు.

**కులాల వారీగా బీసీల వివరాలు ఏవి ?**

రాష్ట్రంలో బీసీల జనాభా 46.25 శాతం ఉందని ప్రకటించిన ప్రభుత్వం సర్వేలో భాగంగా గుర్తించిన బీసీ వివరాలు కులాల వారీగా ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్వే నిర్వహించారని, అప్పుడు రాష్ట్ర జనాభా 3.70 లక్షలు ఉండగా, ఏటా రాష్ట్రంలో జనాభా వృద్ధి రేటు 1.3 శాతం ఉండగా జనాభా 13 శాతం పెరగాల్సి ఉండగా జనాభా 50 నుంచి 60 లక్షలు తప్పుగా చూపారన్నారు. ఇటీవల ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం రాష్ట్రంలో 3.35 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు తేలిందన్నారు. రాష్ట్రంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల సంఖ్య 60 లక్షలు ఉండగా, ఇంటర్ చదువుతున్న విద్యార్థుల సంఖ్య 9 లక్షలు ఉందన్నారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు 30 లక్షల మంది ఉన్నారని ఈ లెక్కన చూసుకుంటే రాష్ట్ర జనాభా 4.35 కోట్లు అవుతుందని, ప్రభుత్వ కులగణనలో 3.70 లక్షల మంది ఉన్నారని చెబుతుందని, సర్వేలో భాగంగా 3.54 లక్షల మంది వివరాలు సేకరించినట్లు ప్రకటించిందన్నారు. ఇంకా 16 లక్షల మంది వివరాలు సేకరించలేదని అంటున్నారని, రాష్ట్రంలో ఇంకా 50 లక్షల మంది వివరాలు సేకరించలేదని, ఏ లెక్కన చూసుకున్న సర్వే తప్పుల తడకగా ఉందని తెలిపారు. బీసీ సబ్ కమిటీ చైర్మన్‌గా మంత్రులు పొన్నం ప్రభాకర్, భట్టి విక్రమార్కలను నియమించకుండా ఉత్తమ్‌కుమారెడ్డిని ఎందుకు నియమించారని ప్రశ్నించారు. ఉత్తుత్తి సర్వేలో కాంగ్రెస్ పార్టీ బీసీలను మభ్య పెడుతుందని, ఇప్పటికే రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీల విషయంలో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ బీసీలను మరోసారి దగా చేసిందని మండిపడ్డారు.

# ప్రాక్టికల్ పరీక్షా కేంద్రం తనిఖీ

భైంసా, ఫిబ్రవరి 7 : భైంసాలోని గురుకృప వొకేషనల్ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలను నిర్మల్ జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురాం శుక్రవారం తనిఖీ చేశారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రానున్న వార్షిక పరీక్షలకు సమాయత్తం కావాలన్నారు. ఆయన వెంట రవికిరణ్, సాయినాథ్, సంధ్య ఉన్నారు.



ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలిస్తున్న పరశురాం

### కారును ఢీ కొన్న లారీ: ఒకరికి గాయాలు

భైంసా, ఫిబ్రవరి 7 : భైంసాలోని నిర్మల్ చౌరస్తాలోశుక్రవారం రాత్రి కారును లారీ ఢీ కొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన గుజ్జుల్‌వార్ శంకర్ కారులో నిర్మల్ వైపు నుంచి వస్తూ పట్టణంలోని చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుంటుండగా, బాసర వైపు నుంచి నిర్మల్ వెళ్తున్న లారీ వేగంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారులోని శంకర్ తలకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. లారీ డ్రైవర్ ఘటన స్థలి నుంచి పరారయ్యాడు.

### రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

తాంసి, ఫిబ్రవరి 7: రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా అందిస్తున్న వ్యవసాయ సంబంధిత రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంహెచ్ మేనేజర్ రవి చంద్రయ్య అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని కప్పర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో లోన్ మేళా నిర్వహించారు. రైతులకు అందించనున్న రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కప్పర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గురుస్వామి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్, ఏఎంహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రంథాలయాన్ని సందర్శించిన విద్యార్థులు



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఎదులాపురం, ఫిబ్రవరి 7: ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో చదువు తున్న విద్యార్థులు శుక్రవారం జిల్లా గ్రంథా లయాన్ని సందర్శిం చారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ, వివిధ భాషలకు చెందిన పుస్తకాలు, జీవిత, స్వీయ, దేశ నాయకుల చరిత్రలు చూపించా రు.ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ రఘుగణపతి, అధ్యాపకులు రేఖ, నరేశ్, అనిత, సంతోషిని, పూనం, జిల్లా గ్రంథాలయ అధికారులు సతీశ్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### 13 నుంచి సదరమ్ శిబిరాలు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 7 : ఈ నెల 13 నుంచి దివ్యాంగులకు సదరమ్ శిబిరాలు నిర్వహించనున్నట్లు నిర్మల్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని వెయిటింగ్ లిస్టులో ఉన్న దివ్యాంగులకు మొబైల్‌కు సమాచారం వచ్చిన వారు ఆయా తేదీల్లో నిర్మల్ ప్రభుత్వ దవాఖానలో ఉదయం 9 నుంచి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13 నుంచి దృష్టిలోపం, 18, 20న ఆర్థోపెడిక్ దివ్యాంగులకు, 25న మానసిక దివ్యాంగులకు, 28న వినికిడి లోపం ఉన్నవారికి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకుని శిబిరాలకు హాజరుకావాలని సూచించారు.

### 10న చలో హైదరాబాద్

భైంసా, ఫిబ్రవరి 7 : రైతు కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను ఖండిస్తూ ఈ నెల 10వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పోశెట్టి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 2025-26 బడ్జెట్ రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు, గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసే విధంగా ఉందన్నారు. ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

### బసవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన దినోత్సవం

భైంసాటౌన్, ఫిబ్రవరి 7 : నిర్మల్ జిల్లా భైంసా మండలం సుంక్లి గ్రామంలో శుక్రవారం వీరశైవ లింగాయత్ సంఘం సభ్యులు బసవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చైర్మెన్ అశోక్, గంగాధర్, పాపన్న, గజానంద్ పాల్గొన్నారు.

### గర్భిణులకు వైద్య పరీక్షలు

నార్నూర్, ఫిబ్రవరి 7 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని ప్రభుత్వ సామాజిక దవాఖానలో ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ ఆధ్వర్యంలో 25 మంది గర్భిణులకు ఉచిత రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి ఐరన్, గ్లూకోస్ మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుశీల, హిమబిందు, మాన్కుబాయి, ఉషారాణి, గోకుల్, అజయ్, సచిన్ పాల్గొన్నారు.

### కేజీబీవీలో టీబీ వైద్య శిబిరం

జైనథ్, ఫిబ్రవరి 7: ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లోని కేజీబీవీలో శుక్రవారం టీబీ వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ నయనత విద్యార్థులకు క్షయ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. 20 మంది విద్యార్థుల నుంచి స్పెట్రమ్ శాంపిల్స్‌ను సేకరించి టీబీ కార్యాలయానికి పంపించారు. మందులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోథ్, ఫిబ్రవరి 7: ఆదిలాబాద్ జిల్లా బోథ్, పొచ్చెర 33/11 కేవీ సబ్ స్టేషన్‌ల్లో మరమ్మతుల మూలంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజినీర్ శ్రావణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇచ్చోడ, ఫిబ్రవరి 7: 33/11 ఇచ్చోడ సబ్ స్టేషన్ మెయింటెన్స్ కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చోడ, నర్సాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

ఎదులాపురం, ఫిబ్రవరి7: ఆదిలాబాద్‌లోని 33/11 కేవీ కైలాష్‌నగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజినీర్ కిరణ్ తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్, ఏరోడ్రోమ్, శాంతినగర్, కైలాష్‌నగర్ ఫీడర్లలో ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

# తునికాకు సేకరణకు ఏర్పాట్లు చేయాలి

పెంబి, ఫిబ్రవరి 7: నిర్మల్ జిల్లా పెంబి మండలంతో పాటు ఆయా మండలాల్లోని అడవుల్లో తునికాకు సేకరణకు అటవీ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో గిరిజనులు, పేద ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఏడాది డిసెంబర్ నెలలోనే తునికాకు సేకరణకు కొమ్మకొట్టుడు ప్రక్రియ మొదలు పెట్టి, కల్లాల ఏర్పాటుకు టెండర్లను పిలిచే వారన్నారు. తునికాకు సేకరణపై ప్రభుత్వం జాప్యం చేయడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారన్నారు. లక్షలాది మంది ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. తునికాకు దొరికే ప్రాంతాల్లో ప్రజలు ఉపాధి కోల్పోకుండా అటవీ శాఖ ద్వారా తునికాకు సేకరణ ప్రక్రియకు ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ధర్మరాజు, భీంరావ్, దేవ్‌రావ్, కృష్ణ, జగన్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తాం

ఎదులాపురం, ఫిబ్రవరి 7: క్రికెట్ తర్వాత కబడ్డీని ప్రజలు ఆదరిస్తున్నారని, క్రీడాకారులను ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తామని కబడ్డీ సంఘం అంతర్జాతీయ డైరెక్టర్ జగదీశ్ యాదవ్ అన్నారు. ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న సీనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ సూర్యపేట, నల్గొండ మధ్య జరిగింది. నల్గొండ 36 పాయింట్లు, సూర్యపేట 39 పాయింట్లు సాధించి గెలుపొందింది. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉష్కం రఘుపతి, సంఘం ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, రాష్ట్ర కార్యదర్శి మహేందర్‌రెడ్డి, ఇండియన్ కబడ్డీ కోచ్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి రవి కుమార్, జిల్లా అధ్యక్షుడు రఘుపతి పాల్గొన్నారు.

# మండలాధికారులకు సన్మానం

బోథ్, ఫిబ్రవరి 7: సొనాల తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సిబ్బందిని శుక్రవారం గ్రామస్తులు సన్మానించారు. ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ మల్లేశ్‌తో పాటు సిబ్బందిని సత్కరించారు. కొత్తగా ఏర్పాటైన మండలాభివృద్ధికి పూర్తి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సొనాల మాజీ సర్పంచ్ సదానందం, గుబ్రాలతండా మాజీ సర్పంచ్ సకారం, జీవన్ కుమార్, సుధీర్ రెడ్డి, చిన్నయ్య, కిష్టయ్య, శంకర్, నరేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**రాయి సెంటర్ ఆధ్వర్యంలో..**

నూతన మండల తహసీల్దార్ ఎంపీడీవోలను పార్డి(బీ) రాయిసెంటర్ ఆధ్వర్యంలో సన్మానించారు. సార్‌మేడి లక్ష్మణ్, మెస్రం భూమన్న, దేవ్‌రావ్, పురుషోత్తం, శంభు, తొక్కి సన్మానించారు.



తహసీల్దార్ మల్లేశ్, సిబ్బందిని సన్మానిస్తున్న సొనాల గ్రామస్తులు